ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
సోమవారం 14 జూలై 2025

షాద్‌నగర్: ఈశ్వర్‌కాలనీలో బోనాల ఊరేగింపు



● వరుణ దేవా కరుణించు..

వరుణ దేవా కరుణించు... సమృద్ధిగా వర్షాలు కురిపించు అని ఆదివారం కేశంపేట మండల కేంద్రంలో మహిళలు కప్ప కావడి నిర్వహించారు. వానలు కురువక పంటలు ఎండిపోతున్నాయని రోకలికి కప్పను, వేప ఆకులను కట్టి పూజలు చేశారు. ఇంటింటికి తిరుగుతూ కప్పకు జలాభిషేకం చేశారు. - కేశంపేట, జూలై 13(ఆంధ్రజ్యోతి)



కేశంపేటలో కప్ప కావడి ఆడుతున్న మహిళలు

కందుకూరు: బోనాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు



అమ్మకు బోనం.. పరవశించిన భక్తజనం

జిల్లావ్యాప్తంగా ఆదివారం బోనాల పండగను ఘనంగా నిర్వహించారు. చేవెళ్ల, మహేశ్వరం, కందుకూరు, యాచారం మండలాల్లోని పల్లెలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. మహిళలు బోనం కుండలతో ఊరేగింపుగా ఆలయాలకు తరలివచ్చి అమ్మవార్లకు నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా శివసత్తుల పూనకాలు, డప్పు చప్పుళ్లు, పోతరాజుల విన్యాసాలు, యువతీయువకుల కేరింతలు అలరించాయి. ఈ వేడుకల్లో ప్రజాప్రతినిధులు పాల్గొని సందడి చేశారు. - ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్, జూలై 13

కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



ఆమనగల్లు, జూలై 13(ఆంధ్రజ్యోతి): సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య పరిరక్షణ, పేదల ఆర్థికాభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధిస్తుందన్నారు. కల్వకుర్తి నియోజకవర్గంలో రూ. 600 కోట్లతో రహదారులు నిర్మిస్తున్నట్లు చెప్పారు. తలకొండపల్లి, కడ్తాల మండలాల్లో 30పడకల ప్రభుత్వ ఆసుపత్రులను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఆమనగల్లు మాజీ వైస్ ఎంపీపీ జక్కు అనంత రెడ్డి, మాజీ సర్పంచ్ జంగయ్య, మార్కెట్ డైరెక్టర్ తాళ్ల రవీందర్, పీఏసీఎస్ డైరెక్టర్ జగన్, శ్రీనివాస్ రెడ్డి, యాదయ్య గౌడ్, కరుణాకర్ గౌడ్ పాల్గొన్నారు.

నేటి నుంచి కొత్త రేషన్‌కార్డుల పంపిణీ

మొయినాబాద్ రూరల్, జూలై13(ఆంధ్యజ్యోతి): కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని అధికారికంగా నేడు (సోమవారం) సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలో సీఎం రేవంత్ చేతుల మీదుగా నిర్వహిస్తుండగా, జిల్లాలో అధికారికంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో మొత్తం 1,32,500 మంది కొత్తరేషన్ కార్డులకు సంబంధించి ప్రొసీడింగ్స్ అందజేయనున్నారు. ఇందులో లక్షా 24వేల యూనిట్లు యాడింగ్ ఉండగా, 8500 కొత్త కార్డులు ఉన్నాయి.

ఇంకెప్పుడు ఇస్తరు?



ఆత్మీయ భరోసా కోసం ఎదురుచూపులు

భూమి లేని నిరుపేదలకు సాయం అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఆత్మీయ భరోసా పథకానికి శ్రీకారం చుట్టింది. ఉపాధి హామీ పథకంలో కనీసం 20 రోజులు పనిచేసిన వారిని అర్హులుగా గుర్తించి సంవత్సరానికి రెండు విడతల్లో రూ.12వేలు అందజేయాలని నిర్ణయించింది. జిల్లాలో అర్హులను ఎంపిక చేసి మొదటి విడతలో రూ.6వేలు లబ్దిదారుల బ్యాంకు ఖాతాలో జమ చేసింది. అయితే రెండో విడత డబ్బుల కోసం వారు ఎదురు చూస్తున్నారు. రైతులకు రైతు భరోసా డబ్బులు వేసిన సర్కార్.. మాకు ఆత్మీయ భరోసా సాయం ఇంకా అందించడం లేదని నిరీక్షిస్తున్నారు.



రంగారెడ్డి అర్బన్/యాచారం జూలై 13 (ఆంధ్రజ్యోతి) : భూమి లేని నిరుపేదలకు రాష్ట్ర ప్రభుత్వం ఏటా రెండు విడతల్లో రూ.12 వేలు అందించేలా 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా' పథకాన్ని ప్రవేశపెట్టింది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధి హామీ పథకంలో 20 రోజులు పనిచేసిన వారిని అర్హులుగా ఎంపిక చేసింది. ఉపాధి కూలీలకు సంబంధించి ఆధార్ కార్డు అనుసంధానం కాని వారి వివరాలను సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ప్రభుత్వం నుంచి పథకానికి సంబంధించి అర్హుల జాబితాను రూపొందించారు. జాబ్‌కార్డుతో ఆధార్ లింక్ కాని ఉపాధి కూలీల ఆధార్, బ్యాంకు ఖాతా, ఫోన్ నెంబర్‌తో పాటు లబ్ధిదారుల్లో

మిగతా 8వ పేజీలో...

భూమి లేని పేదలకు ప్రభుత్వ సాయం
రెండు విడతల్లో రూ.12 వేలు అందజేత
తొలి విడతగా 10,199 లబ్ధిదారులకు రూ.6.23 కోట్లు ఖాతాలో జమ
రెండో విడత భరోసా కోసం లబ్ధిదారుల నిరీక్షణ

రెండో విడత డబ్బులు రాలే..



నాకు సెంటు భూమి లేదు. నా భర్త, నేను కూలీ పనులు చేస్తాం. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద మొదటి విడతలో రూ.6 వేల సాయం నా బ్యాంకు ఖాతాలో పడింది. రెండో విడత డబ్బుల కోసం ఎదురుచూస్తున్న. ఈ పథకం పేదలకు వరంలా ఉంది. ప్రభుత్వం అందించే ఈ సాయంతో నా ఆరోగ్యం కోసం ఖర్చు చేసుకుంటున్న.

- ఇందిరమ్మ, నజ్దిక్‌సింగారం

గొర్రెల పంపిణీ పథకాన్ని అమలు చేయాలి

- గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపాల్



మాట్లాడుతున్న కిల్లా గోపాల్

తలకొండపల్లి, జూలై 13(ఆంధ్రజ్యోతి): గొర్రెల పెంపకం దారుల సహకార సంఘాలకు సకాలంలో ఎన్నికలు నిర్వహించకుండా రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేస్తుందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కిల్లా గోపాల్ అన్నారు. ఎన్నికలకు ముందు గొర్రెల పంపిణీ పథకాన్ని కొనసాగిస్తామని ప్రకటించి అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర దాటినా అమలు చేయకపోవడం సరికాదన్నారు. తలకొండపల్లి మండల కేంద్రంలో ఆదివారం గొర్రెలు, మేకల పెంపకం దారుల సంఘం మండల మహాసభ నిర్వహించారు. గోపాల్ ముఖ్య అతిథిగా హాజరై సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు. అనంతరం మాట్లాడుతూ దళారుల ప్రమేయం లేకుండా నగదు బదిలీ చేసి రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించాలని డిమాండ్ చేశారు. గొర్రెలు, మేకల పెంపకం దారులకు ఏమైనా ప్రమాదం జరిగితే రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా, 50 ఏళ్ల దాటిన వారికి రూ.5 వేలు పింఛన్ ఇవ్వాలన్నారు. పశువుల ఆసుపత్రులలో జీవాలకు నట్టల నివారణ మందులు కూడా ఇవ్వడం లేదని ఆరోపించారు. గొల్లకురుమ యువతకు 50 శాతం రిజర్వేషన్‌తో గొర్రెలఫామ్స్ ఏర్పాటు చేయించాలని డిమాండ్ చేశారు.

నూతన కమిటీ ఎన్నిక

తలకొండపల్లి మండల గొర్రెలు, మేకల పెంపకం దారుల సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా జల్లెల్ల పెంటయ్య, మండల అధ్యక్షుడిగా చిన్నమల్లయ్య, ప్రధాన కార్యదర్శిగా కటికల పాండులతో పాటు సత్తయ్య, విష్ణువర్ధన్, కృష్ణ, నరేశ్, శ్రీను, రాములు, శ్రీశైలం, వెంకటయ్య, నర్సింహ్మా, రామచంద్ర, యాదయ్య, జంగయ్య, సత్యనారాయణ, గణేశ్‌లను సభ్యులుగా ఎన్నుకున్నారు.

ఎయిర్‌పోర్టులో కారు దగ్ధం

● షార్ట్ సర్క్యూట్‌తో మంటలు.. ఆర్పిన ఫైర్ సిబ్బంది



ఎయిర్‌పోర్టులో దగ్ధమైన కారు

శంషాబాద్ రూరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : షార్ట్ సర్క్యూట్‌తో ఓ కారు దగ్ధమైన సంఘటన ఆదివారం ఆర్జీఐఏ ఔట్‌పోస్టు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ జె.బాల్‌రాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి ఉదయం 10.55 గంటలకు శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వచ్చిన ఓల్వో కారు (టీఎస్ 07 ఎఫ్ఎం0007) రోటరీ-1కు చేరుకోగానే ఇంజన్ నుంచి పొగలు వచ్చాయి. అప్రమత్తమైన డ్రైవర్ శ్రీకాంత్ చౌదరి కారును పక్కకు ఆపాడు. ఈ క్రమంలో ఒక్కసారిగి మంటలు చెలరేగాయి. ఎయిర్‌పోర్టులోని ఫైర్ సిబ్బందికి సమాచారం అందించగానే వారు వచ్చి మంటలను అదుపు చేశారు. ఈ ఘటనతో ఆ ప్రాంతంలో ట్రాఫిక్ జామ్ కావడంతో పోలీసులు వచ్చి క్లియర్ చేశారు. కారులో డ్రైవర్ మాత్రమే ఉన్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అటు ఇటు అయితే.. ఇక అంతే!

శంషాబాద్ నుంచి షాద్‌నగర్ వెళ్లే దారిలో తొండుపల్లి వద్ద రైల్వే ట్రాక్‌పై బ్రిడ్జి ప్రమాదకరంగా మారింది. సైడ్ వాల్ కూలిపోవడంతో తాళ్లతో కట్టి వదిలేశారు. ఏదైనా వాహనం అదుపు తప్పితే ఎత్తైన ఆ బ్రిడ్జి మీద నుంచి పడిపోయి పెను ప్రమాదం వాటిల్లే అవకాశం ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ చూపి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు. - ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ రంగారెడ్డి జిల్లా





గోదాములు లేక గోస

● స్థలాలున్నా నిర్మాణం చేయరా? ● వర్షాలకు తడిసిపోతున్న ధాన్యం
● తీవ్రంగా నష్టపోతున్న రైతులు



యాచారంలో కొనుగోలు కేంద్రం వద్ద నిల్వ చేసిన ధాన్యం (ఫైల్)

యాచారం, జూలై 13(ఆంధ్రజ్యోతి): పండించిన ధాన్యాన్ని నిల్వ చేసుకునేందుకు గోదాములు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షానికి ధాన్యం తడిసి గోస తీస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో యాచారం మండల కేంద్రంలో గోదాం నిర్మిస్తామని ప్రకటన చేసినప్పటికీ అది కార్యరూపం దాల్చలేదు. గతేడాది గోదాం నిర్మాణానికి అధికారులు స్థలం కోసం అన్వేషణ సాగించారు. చివరికి స్థలం లేదని ప్రభుత్వానికి నివేదిక పంపించడంతో రూ.50లక్షల నిధులు వెనక్కి వెళ్లిపోయాయి. మండల కేంద్రంలో ఉన్న వెంచర్లలో

మిగతా 8వ పేజీలో...

వర్షానికి ధాన్యం తడుస్తుంది



యాచారంలో ధాన్యం నిల్వ చేసుకునేందుకు గోదాం నిర్మించి రైతులను ఆదుకోండి. వర్షం వచ్చినప్పుడు ధాన్యం తడిసి తీవ్రంగా నష్టపోతున్నాం. రైతు వేదిక పక్కన ఉన్న స్థలంలో మినీ గోదాం నిర్మించడానికి అధికారులు చొరవ తీసుకోవాలి.

ఐలయ్య, రైతు,చౌదర్‌పల్లి

ఇబ్బంది పడుతున్నాం



మండల కేంద్రంలో గోదాం లేకపోవడంతో వర్షానికి ధాన్యం తడచి నష్టపోతున్నాం. వెంచర్లలోని పది శాతం స్థలాలు, లేదా ఇతర ప్రభుత్వ, గ్రామకంఠం భూములను పరిశీలించి గోదాంల నిర్మాణానికి రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలి.

సతీష్ రెడ్డి, రైతు, మల్కీజ్‌గూడ

నేడు షాబాద్‌లో మంత్రి తుమ్మల పర్యటన

షాబాద్, జూలై 13(ఆంధ్రజ్యోతి): షాబాద్ మండలంలో సోమవారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పర్యటిస్తారని సర్దార్‌నగర్ ఏఎంసీ చైర్మన్ పీసరి సురేందర్‌రెడ్డి తెలిపారు. పెదవేడు గ్రామంలో ఆయిల్‌పామ్ మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన పాల్గొంటారని పేర్కొన్నారు.

బీసీ రిజర్వేషన్ల వ్యతిరేకులు చరిత్రహీనులే!

● నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి



వివరాలు 7లో

ఒలింపిక్స్‌లో గోల్డ్‌మెడల్ సాధించడమే లక్ష్యం

రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, ఎమ్మెల్యే కాలె



బహుమతులు అందజేస్తున్న శివసేనారెడ్డి, ఎమ్మెల్యే

షాబాద్, జూలై 13(ఆంధ్రజ్యోతి): ఒలింపిక్ క్రీడల్లో బంగారు పథకం సాధించడమే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి క్రీడాపాలసీని తీసుకువచ్చారని రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. ఏఎంఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 15 రోజులుగా షాబాద్ పీఆర్ఆర్ మినీ స్టేడియంలో జరిగిన క్రికెట్ పోటీల్లో గెలుపొందిన జట్లకు ఆదివారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి, ఆధ్యాత్మిక గురువు మల్లికార్జున అప్పాజీలతో కలిసి వారు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. క్రీడాపాలసీ ద్వారా త్వరలో గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ఆటల పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతీ నియోజకవర్గంలో రూ. 2కోట్ల 50 లక్షల నిధులతో క్రీడామైదానాలను అభివృద్ధి చేసి సీఎం కప్ క్రీడా పోటీలను నిర్వహిస్తామన్నారు. ఒలింపిక్స్‌లో గోల్డ్‌మెడల్ సాధిస్తే ఆ క్రీడాకారునికి రూ. 6కోట్లు అందజేస్తామన్నారు. షాబాద్‌లో 10 ఎకరాల భూమిని కేటాయిస్తే ఇండోర్, అవుట్‌డోర్ క్రీడలు ఆడే విధంగా పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసే బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. కార్యక్రమంలో ఏఎంఆర్ ట్రస్ట్ చైర్మన్ అభిరామ్ రెడ్డి, సురేందర్‌రెడ్డి, పెంటయ్యగౌడ్, ప్రతాప్ రెడ్డి, చంద్రశేఖర్, దర్శన్, మహేందర్, తమ్మలి రవీందర్, చెన్నయ్య, అశోక్, రాంరెడ్డి, వెంకట్ రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, లింగం, బుచ్చయ్య, జంగయ్య, మహేందర్‌గౌడ్, సంజీవరెడ్డి, శ్రీరాం రెడ్డి, రాహుల్, సుభాష్‌రెడ్డి పాల్గొన్నారు.

చేవెళ్లలో కొండెంగల హల్‌చల్

● వానర గుంపులతో భయపడిపోతున్న మహిళలు, పిల్లలు

చేవెళ్ల, జూలై 13 (ఆంధ్రజ్యోతి): చేవెళ్లలో గత కొద్ది నెలలుగా కోతులు, కొండెంగలు హల్‌చల్ చేస్తున్నాయి. ఆదివారం చేవెళ్లలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఓ పూజారి ఇంటి గేటుపై ఎనిమిది కొండెంగలు కూర్చుని ఇంట్లో వారిని భయభ్రాంతులను చేశాయి. కర్రలతో అదిరించగా వానరాలు దూరంగా వెళ్లిపోయాయి. గత కొద్ది నెలలుగా చేవెళ్లలోని ఆయా కాలనీల్లో ఇండ్లపై రోజూ గుంపులుగా కొండెంగలు తిరుగుతూ మీదిమీదికి వస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. మహిళలు, పిల్లలను తరుముతున్నాయని చెబుతున్నారు. అటవీ శాఖ ఉన్నతాధికారులు కొండెంగలను అడవుల్లో వదిలేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



ఓ ఇంటి ముందు కొండెంగల గుంపు













ప్లాట్ల పంపిణీతో నిర్వాసితుల్లో ఆనందం



యాచారం, జూలై 13(ఆంధ్రజ్యోతి): ఫార్మాసిటీ భూనిర్వాసితులకు ప్లాట్ల పంపిణీతో తమకెంతో మేలు జరుగుతుందని మేడిపల్లి, నానక్‌నగర్, తాటిపర్తి, కుర్మిద్ద, మంగలిగడ్డతండా, మర్లకుంటతండా, గొల్లగూడ గ్రామాల నిర్వాసితులు అంటున్నారు. ఫార్మాసిటీకి భూమిచ్చిన ప్రతీ రైతుకు ప్లాట్లు ఇస్తామని నాటి మంత్రి సబితారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఇచ్చిన హామీ నెరవేరిందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అర ఎకరం భూమి కోల్పోయిన రైతులకు కూడా ప్లాట్లు ఇవ్వడం ఆనందాయకం అంటున్నారు. ఎకరం అసైన్డ్ భూమికి రూ.8లక్షలు, ఆక్రమణదారులకు రూ.7.5లక్షలు, ఎకరం పట్టా భూమికి రూ.12.5లక్షల నుంచి రూ.16.5లక్షల పరిహారమిచ్చారు. ప్రస్తుతం ఎకరం పట్టాభూమికి రూ.25లక్షల పరిహారమిచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నాలుగు గ్రామాల్లో ఇప్పటి వరకు 2,814 మంది రైతులకు వారు కోల్పోయిన భూవిస్తీర్ణం మేరకు ప్లాట్లు పంపిణీ చేశారు. మిగిలిన రైతులకు సైతం ప్లాట్లు పంపిణీ చేసేందుకు రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు. ప్రతీ ఎకరం భూమికి 121 గజాల(ఒక గుంట) చొప్పున ప్లాటు ఇచ్చేలా అధికారులు ప్రణాళికను పక్కాగా అమలుచేస్తున్నారు. ఈ ఒక్కో ప్లాటు ప్రస్తుత ధర రూ.10లక్షల నుంచి 15లక్షల వరకు ఉంటుందని రైతులంటున్నారు. ఒక వేళ వ్యవసాయం చేయాలనుకునే వారు తమ ప్లాట్లను విక్రయించి అచ్చంపేట, కల్వకుర్తి, డిండి వంటి ప్రాంతాల్లో భూమి కొంటామని తెలిపారు.



మాకు రెండు ప్లాట్లు వచ్చాయి

మా భూమి పోయిన దాన్ని బట్టి మాకు రెండు ప్లాట్లు వచ్చాయి. వచ్చిన ప్లాట్లలో నేను, నా కొడుకులతో ఇండ్లు కట్టుకుంటాం. మాకు ప్లాట్లు ఇవ్వడంతో భూమి పోయిందన్న బాధ కొంత తీరింది. కొంత ఆర్థిక భరోసా కలిగింది. గతంలో మా భూమి తీసుకున్నందుకు ప్లాట్లు ఇస్తామని నాయకులు, మా గ్రామ పెద్దలు మాటిచ్చారు. మాట ప్రకారం నాకు ప్లాట్లు రావడం సంతోషంగా ఉంది.

- కాసుల రాములమ్మ, మహిళా రైతు, కుర్మిద్ద

మా హయాంలోనే ప్లాట్ల సర్టిఫికెట్లు ఇచ్చాం



ఫార్మాసిటీ నిర్వాసిత రైతులకు ప్లాట్లు ఇస్తే వారికి ఆర్థిక భరోసా కలుగుతుందని గత బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే సీఎం కేసీఆర్‌ను ఒప్పించాం. ప్లాట్లు కేటాయించేలా వెంచర్ ఏర్పాటు చేశాం. అప్పట్లోనే రైతులకు ప్లాట్ల సర్టిఫికెట్లు ఇచ్చాం. ఇందులో కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందేమీ లేదు. మా ప్రభుత్వం వెంచర్ చేయడం వల్లే నేడు రైతులకు ప్లాట్లు కేటాయిస్తున్నారు.

- మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే

ఆసరా పింఛన్ల కోసం ఎదురుచూపులు



కులకచర్ల ఎంపీడీవో కార్యాలయం

కులకచర్ల, జూలై 13(ఆంధ్రజ్యోతి): ఆసరా పింఛన్‌లు మంజూరు కోసం వితంతువులు, దివ్యాంగులు, కుటుంబ ఆసరా లేని వారు ఎదురుచూస్తున్నారు. అర్హత ఉండి పింఛన్ కోసం దరఖాస్తు చేసుకొని ఏళ్లుగా వేచి చూస్తున్నారు. గత ప్రభుత్వంలో పాత వారికి పింఛన్లు వచ్చినా యేటా కొత్తగా మంజూరు చేయలేదు. దీంతో నాలుగేళ్లుగా దరఖాస్తుదారులు పింఛన్ కోసం నిరీక్షిస్తున్నారు. ఇప్పటి వరకు మండలంలో వివిధ రకాల పింఛన్ల కోసం 600 మంది దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. 58 ఏళ్లు నిండిన వారు వృద్ధాప్య పింఛన్‌కు, వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు.

ప్రజాపాలనలో దరఖాస్తులు చేసినా...

ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ఊరూరా దరఖాస్తులు స్వీకరించింది. పింఛన్ కోసం వివిధ వర్గాల వారు 450 మందికిపైగా దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వం ఇప్పటి వరకు వారికి పింఛన్‌లు మంజూరు చేయలేదు. రాష్ట్రంలో త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో దరఖాస్తుదారులకు ఆశలు రేకెత్తాయి. స్థానిక ఎన్నికల సందర్భంగానైనా ప్రభుత్వం కొత్తవారికి పింఛన్‌లు మంజూరు చేస్తుందని ఆశిస్తున్నారు.

పింఛన్ కోసం ఎదురుచూస్తున్న



నా భర్త మూడేళ్ల క్రితం అనారోగ్యంతో చనిపోయాడు. నేను కూలి పనులు చేసుకుంటూ కొడుకులతో కలిసి జీవిస్తున్నా. ప్రభుత్వం నాకు వితంతు పింఛన్ మంజూరు చేసి ఆదుకోవాలి. కుటుంబ పోషణ భారమైతోంది.

- శివమ్మ, లాల్‌సింగ్‌తండా

ఎన్నోసార్లు దరఖాస్తు ఇచ్చిన



నాలుగేళ్ల నుంచి ఆసరా పింఛన్ కోసం ఎన్నో సార్లు దరఖాస్తు చేశాను. కానీ ఇప్పటి వరకు నాకు పింఛన్ రాలేదు. కూలి పని చేస్తున్నా. నాకు భార్య, పిల్లలు ఉన్నారు. వృద్ధాప్య పింఛన్ ఇచ్చి ఆదుకోవాలి.

- లింగం, బండవెల్కిచర్ల

అల్లుకుంటున్న నిర్లక్ష్యం



సంగెంలో ట్రాన్స్‌ఫార్మర్ పోల్‌కు అల్లుకుంటున్న తీగ మొక్క

కేశంపేట, జూలై 13(ఆంధ్రజ్యోతి): టాన్స్‌కో అధికారుల నిర్లక్ష్యంతో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తీగల మొక్క అల్లుకుంటోంది. సంగెం గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద చెత్త, చెదారం తొలగించకపోవడంతో అక్కడ పిచ్చి మొక్కలు పెరిగాయి. అలాగే తీగ జాతికి చెందిన ఓ మొక్క ట్రాన్స్‌ఫార్మర్ స్తంభానికి అల్లుకొని తీగలను చుట్టేసింది. ఇంకా కొన్ని రోజులైతే ట్రాన్స్‌ఫార్మర్‌కు చుట్టుకునే ప్రమాదం ఉంది. అంతేకాకుండా తీగ జాతి మొక్కకు పశువులు, జీవాలు తగిలితే విద్యుత్ షాక్ కొట్టి చనిపోయే ప్రమాదముంది. అధికారులు స్పందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రోడ్డు పక్కన కొట్టుకుపోయిన మట్టి

● ప్రమాదకరంగా మారుతున్న వైనం



కూలుతున్న రోడ్డు సైడ్‌బర్మ్‌లు

కేశంపేట, జూలై13(ఆంధ్రజ్యోతి): వర్షాలధాటికి రోడ్ల పక్కన పోసిన మట్టి కూలుతోంది. ఇలాగే వదిలేస్తే రోడ్డు పటిష్టతకు ప్రమాదం ఏర్పడే ఆస్కారం ఉంది. సుందరపురం గ్రామ నుంచి తొమ్మిదిరేకుల మీదుగా బీటీ రోడ్డును డబుల్ రోడ్డుగా అభివృద్ధి చేస్తున్నారు. సుందరాపురం నుంచి కాకునూర్ వరకు డబులు రోడ్డు వేశారు. బీటీ రోడ్డుకు ఇరువైపులా మొరం పోశారు. ఇటీవలి వర్షాలకు రోడ్డుపై నుంచి నీరు కిందకు పారింది. దీంతో మొరం కొట్టుకపోయింది. మొరం కొట్టుక పోయిన ప్రదేశంలో మరోసారి మట్టికానీ, మొరం కానీ పోయకపోతే రోడ్డు సైతం కొట్టుకుపోయే అవకాశం ఉంది. కాంట్రాక్టర్ వెంటనే స్పందించిన రోడ్డు పటిష్టత దెబ్బతినకుండ చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బీసీ సంక్షేమ సంఘం మండలాధ్యక్షుడిగా మన్నె వెంకటేశ్

శంకర్‌పల్లి, జూలై 13(ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమ సంఘం శంకర్‌పల్లి మండాలాధ్యక్షుడిగా మోకిలకు చెందిన మన్నె వెంకటేశ్ ఎంపికయ్యారు. సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య నుంచి ఆదివారం హైదరాబాద్‌లో నియామకపత్రం అందుకున్నారు. వెంకటేశ్ మాట్లాడుతూ.. బీసీల అభ్యున్నతికి కృషిచేస్తానన్నారు. బీసీలు రాజకీయంగా రాణించాలన్నారు. మండల ఉపాధ్యక్షుడిగా వడ్ల నర్సింహాచారి, ప్రధాన కార్యదర్శిగా సంపత్‌కుమార్‌లు కూడా నియామకపత్రాలు అందుకున్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం చేవెళ్ల నియోజకవర్గ అధ్యక్షుడు బండమీది వెంకటయ్య పాల్గొన్నారు.



వెంకటేష్‌కు నియామకపత్రం అందజేస్తున్న కృష్ణయ్య

గీతా పారాయణం.. సకల పాపహరణం



గీతా పారాయణంలో మహిళలు

వికారాబాద్, జూలై 13(ఆంధ్రజ్యోతి): భగద్గీత పారాయణం ద్వారా పాపాలు తొలిగిపోతాయని, గీతాపారాయణాన్ని హిందువులంతా నేర్చుకోవాలని గీతా వాహిని బృందం జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవిసదానందరెడ్డి అన్నారు. ఆషాడ గీతా పారాయణంలో భాగంగా ఆదివారం వికారాబాద్‌లోని గౌతమి కళాశాలలో గీతా పారాయణాన్ని నిర్వహించారు. చిన్నారులు భగవద్గీత శ్లోకాలు పఠించారు. శ్రీదేవి మాట్లాడుతూ.. గత 7 సంవత్సరాలుగా గీతా పారాయణం చేస్తున్నట్టు, ప్రతి ఆషాడంలో జిల్లా నలు మూలల్లోని ఆలయాలు, ప్రాంతాల్లో పారాయణాన్ని చేపడుతున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు సరళ, జయశ్రీ, లావణ్య, వరలక్ష్మి, మాధురి, ఝాన్సీరాణి, విజయలక్ష్మి, సరిత, నీరజ, సునీత, లక్ష్మి, సంజీవరాణి, అనురాధ, జ్యోత్స్న, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సదానందరెడ్డి, కళాశాల కరస్పాండెంట్ రాజవర్ధన్‌రెడ్డి, యోగా గురువు అనంతయ్య, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

● బీజేపీ ఏపీ మాజీ అధ్యక్షుడు సోము వీర్రాజు



పూజల్లో సోము వీర్రాజు, ఆచారి తదితరులు

ఆమనగల్లు, జూలై13(ఆంధ్రజ్యోతి):కేంద్ర ప్రభుత్వ పథకాలను బీజేపీ శ్రేణులు ప్రజల్లోకి తీసుకుపోవాలని బీజేపీ ఏపీ మాజీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. దేశాభ్యున్నతి, భద్రత కోసం ప్రధాని మోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఆమనగల్లు, కడ్తాల్ మండలాల్లో ఆదివారం వీర్రాజు పర్యటించారు. కల్వకుర్తి పట్టణానికి వెళ్తున్న ఆయనకు కడ్తాల టోల్‌గేట్ వద్ద ఎన్‌బీసీ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి, నాయకులు ఘన స్వాగతం పలికారు. మైసిగండి మైసమ్మకు పూజలు చేశారు. అనంతరం పట్టణంలోని బీజేపీ కార్యాలయానికి చేరుకొని పార్టీ నేతలతో సమావేశమయ్యారు. హామీల అమలుపై రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేలా పార్టీ కార్యక్రమాలు చేపట్టాలని వీర్రాజు నాయకులకు సూచించారు. వచ్చే ఎన్నికల్లో కల్వకుర్తిలో ఆచారి విజయం తథ్యమని అన్నారు. సమావేశంలో మాజీ జడ్పీటీసీ కండె హరిప్రసాద్, బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు కర్నాటి విక్రమ్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లా కౌన్సిల్ మెంబర్ చెక్కాల లక్ష్మణ్, అసెంబ్లీ నియోజకవర్గ కో-కన్వీనర్ నర్సింహ, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ కో-కన్వీనర్ రవిరాథోడ్, నాయకులు శ్రీనివాస్, రెడ్యానాయక్, చందన్‌నాయక్, రాజు, అశోక్, జంగయ్య, శ్రీను, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు

తలకొండపల్లి, జూలై 13(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రం ఏర్పాటుకు ఆమరణ నిరహార దీక్ష ప్రారంభిస్తామని గట్టిప్పలపల్లి జేఏసీ నాయకులు ప్రకటించారు. గట్టిప్పలపల్లిని మండలం చేసేవరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. గట్టిప్పలపల్లిని మండలంగా ప్రకటించాలని కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరహార దీక్షలు ఆదివారం 253వ రోజుకు చేరాయి. జేఏసీ నాయకులు, యువకులు, వివిధ పార్టీల నాయకులు, మెదక్‌పల్లి, వెంకట్రావ్‌పేట, బొమ్మరాశిపల్లి ప్రజలు పాల్గొన్నారు.

వర్షాల కోసం వరదపాశం


మల్లన్న గుట్ట వద్ద వరదపాశంలో పాల్గొన్న ముద్దెంగూడ గ్రామస్తులు

షాబాద్, జూలై 13(ఆంధ్రజ్యోతి): వర్షాలు కురవాలని మండల పరిధిలోని ముద్దెంగూడ గ్రామస్తులు, రైతులు మల్లన్నగుట్ట వద్ద ఆదివారం వరద పాశంపోశారు. వారు మాట్లాడుతూ... వర్షాలు కురవక పొలాల్లో మొలకలు వాడుతున్నాయని తెలిపారు. 'వరుణదేవా కరుణించు.' అని బండపై పాశం పోసుకుని తిన్నారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

తెలుగు సినీ ఆర్ట్ డైరెక్టర్స్ అసోసియేషన్ సభ్యులకు ఇళ్ల స్థలాలు


అసోసియేషన్ సభ్యులతో సినీ నటుడు అలీ తదితరులు

కేశంపేట, జూలై 13(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వేములనర్వ శివారులో తెలుగు సినీ ఆర్ట్ డైరెక్టర్స్ అసోసియేషన్ సభ్యులకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు రమణ వంక నేతృత్వంలో ఆదివారం 172మంది సభ్యులకు ఒక్కొక్కరికి 200 గజాల చొప్పున ఇంటి స్థలాల పంపిణీ చేశారు. కార్యక్రమానికి ప్రముఖ నటుడు అలీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. అసోసియేషన్ ముందు చూపుతో ఈ ప్రాంతంలో 2017లో 11ఎకరాల భూమి కొనడం అభినందనీయం అన్నారు. ప్లాట్ల పంపిణీతో అసోసియేషన్ లక్ష్యం నేరవేరిందన్నారు. కార్యక్రమంలో ప్రొడ్యూసర్స్ చాంబర్ అధ్యక్షుడు దామోదర్ ప్రసాద్, మాజీ జెడ్పీటీసీ తాండ్ర విశాలశ్రవణ్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య, నాయకులు మల్లేష్, తుమ్మల గోపాల్, రొల్ల రాఘు రాములుగౌడ్, నవీన్, రమేష్, రాఘవేందర్, మనోహర్‌గౌడ్ పాల్గొన్నారు.

బీరు సీసాలో చెత్త


బీరు సీసాలో కన్పిస్తున్న చెత్త

దోమ, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఓ వినియోగదారుడు కొన్ని బీరు సీసాలో చెత్తచెదారం వచ్చింది. మండలంలోని గుడూరుకు చెందిన రమేశ్ స్నేహితుడితో కలిసి గ్రామంలోని బెల్టు షాపులో కింగ్‌ఫిషర్ లైట్ బీరు కొన్నాడు. బీరు మూతవిప్పి తాగుతుండగా కిందిభాగంతో చెత్త పేరుకోవడం కన్పించింది. దీంతో ఆందోళన చెందిన రమేశ్ దుకాణ యజమానిని నిలదీశాడు. దానికి తానేం చేయాలని, కంపెనీ నుంచే అల్ల వచ్చిందని సమాధానం చెప్పాడు. దీంతో రమేశ్ బీరు సీసాను ఫొటో తీసి సామాజిక మాధ్యమాల్లో అప్‌లోడ్ చేశాడు. చివరికి బాటిల్‌ను దుకాణంలోనే పారేసి వెళ్లిపోయాడు. అది కల్తీ బీరు అని, దానికి విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని అతడు కోరుతున్నాడు. కాగా ఈ బీర్లను పరిగిలోని ఓ వైన్స్‌లో తెచ్చి గ్రామంలో విక్రయిస్తున్నట్లు తెలిసింది.

ఫార్మర్ రిజిస్ట్రీకి డబ్బుల వసూలు!

దోమ, జూలై 13(ఆంధ్రజ్యోతి): ఫార్మర్ రిజిస్ట్రేషన్‌కు డబ్బులు ఇవ్వాల్సిందేనని మండల వ్యవసాయ అధికారులు కొత్త నిబంధన తీసుకొచ్చారు. అధికారుల పర్యవేక్షణ లోపంతో ఏఈవోలు అక్రమంగా ఫార్మర్ రిజిస్ట్రీకి డబ్బు వసూలు చేస్తున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. మండలంలో 36 పంచాయతీల్లో 16,606 మంది రైతులు ఉన్నారు. గ్రామాల్లో ఏఈవోలు ఫార్మర్ రిజిస్ట్రీ కొనసాగిస్తున్నారు. మోత్కూర్ క్లస్టర్ ఏఈవోకు మోత్కూర్, అయినాపూర్, ఖమ్మం నాచారం, దోర్నాలపల్లి గ్రామాలున్నాయి. అయినాపూర్‌లో ఏఈవో ఓ ప్రైవేట్ వ్యక్తికి ఏఈవో లాగిన్ ఐడీ ఇచ్చి ఫార్మర్ రిజిస్ట్రీ చేయిస్తున్నాడు. ఆ వ్యక్తికి డబ్బులివ్వాలని ఏఈవో సూచిస్తుండడంతో చేసేదిలేక రైతులు రూ.50 ఇచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్నారు. రూపాయి తీసుకోకుండా ఏఈవోలు చేయాల్సిన పనిని ప్రైవేట్ వ్యక్తితో చేయిస్తూ డబ్బులు దండుకుంటున్నారు. మోత్కుర్ ఏఈవో వద్దకు రైతులు పనులకు వెళితే వారిపై చిందులేస్తున్నట్టు ఫిర్యాదులు ఉన్నాయి.

నమోదు కార్యక్రమాన్ని ఉచితంగానే చేయాలి



ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఏఈవోలు ఉచితంగా చేయాలి. మోత్కూర్ క్లస్టర్ ఏఈవో డబ్బులు వసూలు చేస్తున్నట్లు మా దృష్టికి రాలేదు. డబ్బులు వసూలు చేసినట్లు తెలితే పూర్తిస్థాయిలో విచారణతో శాఖాపరంగా అతడిపై చర్యలు తీసుకుంటాం.

\- ప్రభాకర్‌రావు, మండల వ్యవసాయ అధికారి

ఆలయంలో ఘనంగా జెండావిష్కరణ

ఘట్‌కేసర్ రూరల్ జూలై 13(ఆంధ్రజ్యోతి): ఘనాపూర్ అనుబంధ పకీర్‌టెక్యాంలో ఆదివారం జగదాంబదేవి సహిత సేవాలాల్ మహరాజ్ ఆలయంలో జెండా విష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అమ్మవారికి అర్చనలు, అభిషేకాలు చేశారు. లంబాడాల ఆరాధ్య దైవమైన జగదాంబదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ బి-బాక్ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, మాజీ సర్పంచ్ రూప్‌సింగ్, గోపాల్‌రెడ్డి, సురేష్‌నాయక్, పూజారి అమర్‌సింగ్, గ్రామస్తులు పాల్గొన్నారు.


జెండావిష్కరణ, పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న నాయకులు

మహిళల మైదాకు సంబురాలు

● ఆషాఢం నేపథ్యంలో సామూహిక మెహందీ వేడుకలు


తలకొండపల్లి : చంద్రధనలో గోరింటాకు చూపుతున్న మహిళలు

తలకొండపల్లి/కందుకూరు, జూలై 13(ఆంధ్రజ్యోతి): ఆషాఢ మాసంలో మహిళలు సామూహిక గోరింటాకు సంబరాలు నిర్వహించుకుంటూ మురిసిపోతున్నారు. పట్టణాలు, గ్రామాల్లో మహిళలు, యువతులు, చిన్నారుల చేతులు గోరింటాకుతో కళకళలాడుతున్నాయి. చేతుల్లో కొత్తకొత్త డిజైన్లు వేసుకుంటూ ఎర్రగా పండగానే సంతోషిస్తున్నారు. తలకొండపల్లి మండలం చంద్రధనలో ఆదివారం హనుమాన్ ఆలయం వద్ద గోరింటాకు సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీఅష్టోత్తర పారాయణం, హనుమాన్ చాలీసా పఠనం, పూజలు నిర్వహించారు. అలాగే కందుకూరు ఉన్నత పాఠశాలకు పూర్వ టెన్త్(1990-1991 బ్యాచ్) విద్యార్థులు గోరింటాకు సంబురాలను జరుపుకున్నారు. పూర్వ విద్యార్థులు సమ్మేళనాలను జరుపుకోవడం సహజమే కానీ.. అందుకు భిన్నంగా కందుకూరు జెడ్పీ స్కూల్ పూర్వ విద్యార్థినులు ఆషాఢ గోరింటాకు సంబరాల వేడుకగా నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థినీవిద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


గోరింటాకు సంబరాల్లో కందుకూరు మహిళలు

రైతులకు ఆర్బీఓఎల్ ఊతం!

● ఇథనాల్ తయారీకి వ్యవసాయోత్పత్తుల కొనుగోలు

- కంపెనీ రాకతో రెట్టింపు స్థాయిలో పెరిగిన వరి సాగు
- రోజూ 2లక్షల లీటర్ల ఇథనాల్, ఈఎన్ఏ ఉత్పత్తి
- స్థానిక రైతులకు తొలగిన మార్కెటింగ్ కష్టాలు


తాండూరులోని ఆర్బీఓఎల్ కర్మాగారం

తాండూరు, జూలై 13(ఆంధ్రజ్యోతి): గతంలో వరి ధాన్యం పండించేందుకు తాండూరు ప్రాంత రైతులు ఆసక్తి చూపేవారు కాదు. మద్దతు ధర లభించక తంటాలు పడేవారు. అలాగే వరి సాగుకు నీటి వసతులు కూడా తక్కువే ఉండేవి. ఐతే ఐదారేళ్లుగా పరిస్థితి మారింది. ఇందుకు ప్రధాన కారణం.. ర్యాడికల్ బయో ఆర్గానిక్ లిమిటెడ్(ఆర్బీఓఎల్) కంపెనీ అని చెప్పొచ్చు. పెట్రో ఉత్పత్తులను పెంపొందించేందుకు కేంద్ర ప్రభుత్వ ప్రోత్సాహంతో ఆర్బీవోఎల్‌లో ఇథనాల్ తయారీ చేస్తున్నారు. పదేళ్లుగా మద్యంలో కలిపే ఈఎన్ఏ తయారీ చేసిన ఈ కంపెనీ గతేడాదిగా ఇథనాల్ ఉత్పత్తి చేస్తోంది. ఇథనాల్‌ను 20 శాతం పెట్రోల్‌లో కలిపి మార్కెట్లో విక్రయిస్తోంది. దక్షిణాది రాష్ట్రాల ఆయిల్ కంపెనీల నుంచి భారీగా ఆర్డర్లు వస్తుండడంతో ఆర్బీవోఎల్ ఉత్పత్తులకు గిరాకీ ఏర్పడింది. త్వరలో జెట్ విమానాలకు సైతం ఇంధనం ఇథనాల్ అందజేసేందుకు సంస్థ సిద్ధమవుతోంది.

వాయు కాలుష్య నివారణకు ఇథనాల్ దోహదం

ఇథనాల్, ఈఎన్ఏ తయారీకి వ్యవసాయ ఉత్పత్తులు చాలా అవసరం. పాడైన బియ్యం, నూకలు, మొక్కజొన్న తదితర పంట ఉత్పత్తుల నుంచి ఇథనాల్‌ను తీస్తారు. గతంలో ఈ ముడిసరుకును ఆర్బీవోఎల్ దూరప్రాంతాల నుంచి దిగుమతి చేసుకునేంది. గత ఐదారేండ్లుగా తాండూరు ప్రాంత రైతులకు తగిన ప్రోత్సాహం కల్పిస్తూ, వారిలో అవగాహన పెంచి పంట ఉత్పత్తులకు తగిన రేటు పెట్టి ఈ కంపెనీ కొనుగోలు చేస్తోంది. దీంతో స్థానిక రైతులు వరి, మొక్కజొన్న పంటలను పెద్ద మొత్తంలో సాగుచేస్తున్నారు. గత రెండు సీజన్లలో 60వేల హెక్టార్లలో వరి పండిస్తున్నట్టు లెక్కలు వెల్లడిసున్నాయి. మార్కెట్ రేటుకుంటే ఎక్కువ ధరనే ఈ సంస్థ చెల్లిస్తోంది. యాలాల, బషీరాబాద్, పెద్దేముల్, కొడంగల్, కోస్గి మండలాల రైతులు తమ ఉత్పత్తులను భారీగా ఆర్బీవోఎల్‌కు తరలిస్తున్నారు. 2025 జూలై నాటికి క్వింటాలు నూకలు రూ.2,500 వరకు చెల్లిస్తున్నారు. సరుకు అమ్మిన మూడు నుంచి వారం రోజుల్లో రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బు జమ చేస్తున్నారు. కంపెనీ నిర్వాహకులు పారదర్శకంగా కొనుగోళ్లు చేపడుతున్నారు. రైతులు పండించిన వడ్లను మిల్లుల్లో నూకలుగా పట్టించి వాటిని ఆర్బీవోఎల్‌కు తరలిస్తున్నారు. చాలామంది చిరు వ్యాపారులు కూడా నూకలు, మొక్కజొన్న వ్యాపారం నిర్వహిస్తూ స్థానికంగా ఉపాధి పొందుతున్నారు. కొందరు రైతుల నుంచి ధాన్యం కొని మిల్లింగ్‌తో నూకలు చేసి కంపెనీకి అమ్ముతూ లాభాలు గడిస్తున్నారు.

స్టాక్ మార్కెట్ వైపు కంపెనీ చూపు

ఆర్బీఓఎల్ సంస్థ లాభాల్లో నడుస్తున్నందున స్టాక్ మార్కెట్లో లిస్టింగ్, షేర్ల క్రయవిక్రయాలకు యాజమాన్యం ఫోకస్ పెట్టింది. రానున్న రెండు నెలల్లో విపణిలోకి అడుగుపెట్టేందుకు యాజమాన్యం సిద్ధం చేసుకున్నట్లు సమాచారం. తెలంగాణలో ఉన్న నాలుగు ఇథనాల్, ఈఎన్ఏ ఫ్యాక్టరీల్లో లాభాల్లో నడుస్తున్న ఆర్బీవోఎల్ పట్ల మదుపరులు,పెట్టుబడిదారులు షేర్లు కొనేందుకు ఆసక్తిచూపుతారనే చర్చ నడుస్తోంది.

కేంద్ర ప్రభుత్వ ప్రోత్సాహంతో నిర్వహణ



గతంలో రోజుకు 60వేల లీటర్ల ఈఎన్ఏ తయారీ చేసిన ఆర్బీవోఎల్ ప్రస్తుతం రోజూ 2లక్షల లీటర్ల ఉత్పత్తి చేస్తోంది. ఇథనాల్‌ను పెట్రోల్‌లో కలిపి వినియోగించడం ద్వారా కాలుష్యాన్ని అరికట్టొచ్చు. అందుకు ఇలాంటి పరిశ్రమలను కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. గతంలో 4శాతం ఇథనాల్‌ను పెట్రోల్‌లో కలిపి విక్రయించారు. కాలుష్య నియంత్రణలో భాగంగా క్రమంగా ఇథనాల్ కలిపే శాతాన్ని పెంచి ప్రస్తుతం 20శాతం వరకు కలుపుతున్నారు. రాబోయే రోజుల్లో 50శాతం కలిపే అవకాశాలు ఉన్నాయని శాస్త్రవేత్తలు, ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి. దీంతో పాటు జెట్ విమానాల ఇంధనానికి ఇథనాల్ సరఫరా చేసేలా ఉత్పత్తని భారీగా పెంచనున్నాం.

\- బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి, సీఈవో, ఆర్బీఓఎల్

బీసీ రిజర్వేషన్ల వ్యతిరేకులు చరిత్రహీనులలే!


ఎంపీ మల్లు రవిని సన్మానిస్తున్న నర్సింహ, గుర్రం కేశవులు

ఆమనగల్లు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లను కల్పించే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం దేశ వ్యాపితంగా ప్రభావితం చేసిందని, ఈ రిజర్వేషన్ల వ్యతిరేకులు చరిత్రహీనులుగా మిగులుతారని నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి అన్నారు. బీసీ రిజర్వేషన్లను షెడ్యూల్ 9లో చేర్చి చట్టబద్ధత కల్పించేలా కేంద్రంపై ఒత్తిడికి బీజేపీ మంత్రులు, రాష్ట్ర ఎంపీలు చొరవ చూపాలని కోరారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లపై ప్రభుత్వ నిర్ణయాన్ని హర్షిస్తూ ఆదివారం ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ గుర్రం కేశవులు,పీసీసీ కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు కృష్ణ, ఆమనగల్లు, కడ్తా ల మండలాల కాంగ్రెస్ నాయకులు ఆదివారం ఎంపీని హైదరాబాద్‌లో కలిసి ధన్యవాదాలు తెలిపారు. చరిత్రలో వివిధ సామాజిక వర్గాల కు అత్యధిక రిజర్వేషన్లు కల్పించిన ఘనత కాం గ్రెస్ ప్రభుత్వానిదే అన్నారు. రిజర్వేషన్ల పెంపుతో బీసీలంతా సంబరాలు చేసుకుంటుంటే బీఆర్ఎస్ నేతలు అడ్డుకునేందుకు కుట్ర చేస్తున్నారని ఆరోపిం చారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ ప్రభు త్వ నిబద్ధతను ఎవరూ సవాల్ చేయలేరన్నారు. సా మాజిక న్యాయం, బీసీ రిజర్వేషన్ల అమలు కాంగ్రెస్ తోనే సాధ్యం అని రవి చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి అన్ని సామాజిక వర్గాలకు మేలు చేసేలా నిర్ణయా లు తీసుకుంటున్నారని తెలిపారు. బీసీల రిజర్వేషన్ల ను వ్యతిరేకించే వారిని బీసీ సంఘాల నాయకులు, ప్రజలు నిలదీయాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, వీరయ్య, విష్ణువర్ధన్, శివరాజ్ పాల్గొన్నారు.

కార్యాలయాలు ఏర్పాటు చేయాలని వినతి

ఆమనగల్లులో సబ్ రిజిస్ట్రార్, సబ్ ట్రెజరీ కార్యాలయాలను ఏర్పాటు చేయాలని ఎంపీ మల్లు రవిని గుర్రం కేశవులు, యాట నర్సింహ కోరారు. పట్టణంలో కార్యాలయాలు పట్టణం, గ్రామీణ మండలాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎంపీకి తెలిపారు. కార్యాలయాల ఏర్పాటుకు ప్రభుత్వ పరంగా చొరవ తీసుకోవాలని నాయకులు కోరారు. దీనిపై ఎంపీ సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు.రవికి వినతిపత్రం అందజేసిన వారిలో మండ్లీ రాములు తదితరులు ఉన్నారు.

షాద్‌నగర్‌లో ఘనంగా వేంకటేశ్వరుడి కల్యాణోత్సవం


వేంకటేశ్వరుడికి పల్లకీ సేవ నిర్వహిస్తున్న భక్తులు

షాద్‌నగర్ అర్బన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ ముఖ ద్వారంగా వెలిసిన లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం శ్రవణ నక్షత్రాన్ని పురష్కరించుకుని స్వామి వారి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ పూజారి శ్రీనివాసచార్యుల నేతృత్వంలో లక్ష్మీవేంకటేశ్వరుల కల్యాణోత్సవాన్ని అనంతరం ఆలయం చుట్టు పల్లకీ సేవను నిర్వహించారు.

బీఆర్ఎస్ పాలనలో బిల్లు ఎందుకు తేలేదు?


సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకురాలు రాణి

కేశంపేట,జూలై 13(ఆంధ్రజ్యోతి): తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత తాను ఉద్యమం చేస్తేనే బీసీ రిజర్వేషన్లొచ్చాయని చెప్పుకుంటున్నారని, పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో బిల్లు ఎందుకు తేలేదని కేశంపేట మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు రాణి ప్రశ్నించారు. బీసీ బిల్లుకు బ్రాండ్ అంబాసిడర్ కాం గ్రెస్ పార్టీ, సీఎం రేవంత్‌రెడ్డిలే అని స్పష్టం చేశారు. గత శనివారం కాకునూర్‌కు వచ్చన కవిత మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ అమలు చేయడంలేదని, మహాలక్ష్మీ పథకం కింద ప్రతీ పేద మహిళలకు నెలకు రూ.2,500 ఇవ్వాలని, సన్న బియ్యంలో నూకలు వస్తున్నాయని, పాలమూరు ప్రాజెక్టులను కాంగ్రెస్ పాలకులు పక్కనబెట్టారని తదితరాంశాలపై అసంబద్ధంగా మాట్లాడారని విమర్శించారు. ఆదివారం కొత్తపేటలో కాంగ్రెస్ నాయకురాళ్లు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలో మహిళలు సంతోషంగా ఉన్నారన్నారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, ఉచిత కరెంట్, గ్యాస్ సబ్సిడీ, సన్న బియ్యం వంటి పథకాలతో మహిళలు సంతోషంగా ఉంటే బీఆర్ఎస్ నాయకులు ఓర్వడం లేదని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన 18నెలల్లోనే ప్రతీ పేదకు ఇంటిని నిర్మిస్తోందన్నారు. రానున్న మూడేళ్లలో పేదలకు మరన్ని పథకాలు అందుతాయని తెలిపారు. బీఆర్ఎస్‌కు వార్షిక పరీక్షల్లో(అసెంబ్లీ ఎన్నికల్లో) పాస్ మార్కులు, ప్లిమెంటరీ(ఎంపీ ఎన్నికల్లో) జీరోలొచ్చాయని ఎద్దేవా చేశారు. స్థానిక సంస్థల్లోనూ గుండు సున్నాలే వస్తాయని మాజీ జెడ్పీటీసీ విశాలశ్రవణ్‌రెడ్డి అన్నారు. సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలు అనసూయమ్మ, కాంగ్రెస్ మండల నాయకురాళ్లు అరుణ, సుజాత, కళమ్మ, అస్మా, లలిత, సువర్ణ, లక్ష్మీ, మణెమ్మ, నర్సమ్మ, చెన్నమ్మ పాల్గొన్నారు.

యువత అన్ని రంగాల్లో రాణించాలి


అంబేడ్కర్ విగ్రహం వద్ద మాట్లాడుతున్న నాయకులు

ఘట్‌కేసర్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): యువత అంబేడ్కర్‌ను స్ఫూర్తిగా తీసుకొని అన్ని రంగాల్లో రాణించేందుకు శ్రమించాలని అంకుషాపూర్ మాజీ సర్పంచ్ రామలింగంగౌడ్ అన్నారు.ఆదివారం ఘట్‌కేసర్‌లో ప్రబుద్ధ భారత్ సంస్థ ఆధ్వర్యంలో ఎ దులాబాద్ రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో దాసు, నర్సింగరావు, సత్యం, రాజేష్, సురేష్, సుధాకర్, అశోక్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విపక్షాల అసత్య ప్రచారాన్ని కాంగ్రెస్ తిప్పికొట్టాలి


సమావేశంలో మాట్లాడుతున్న బాలాజీసింగ్

కడ్తాల్, జూలై 13(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలకు కాంగ్రెస్ శ్రేణులు కార్యోన్ముఖులు కావాలని పీసీసీ అధికార ప్రతినిధి, జెడ్పీ మాజీ వైస్‌చైర్మన్ బాలాజీసింగ్ పిలుపునిచ్చారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకుపోవాలని కోరారు. ముద్విన్ గ్రామంలో ఆదివారం కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. బాలాజీ సింగ్ హాజరై మాట్లాడారు. పార్టీ బలోపేతం, స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. ఆయన మాట్లాడుతూ.. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలే కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపునకు సోపానమన్నారు. రాష్ట్రంలో ఎన్నిక ఏదైనా కాంగ్రెస్‌దే విజయం అన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లకు ప్రభుత్వం ఆమోదించడం సాహసోపేత నిర్ణయమన్నారు. పార్టీ కోసం పనిచేసే నాయకులు, కార్యకర్తలకు ప్రభుత్వ, పార్టీ పరంగా అవకాశాలు లభిస్తాయని చెప్పారు. స్వార్థ శక్తులు ఎన్ని కుట్రలు పన్నినా కాంగ్రెస్ ప్రజాభిమానం ముందు దిగదుడుపే అన్నారు. పేదలందరికీ ప్రభుత్వం పథకాలను అందజేస్తుందన్నారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి చొరవతో నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తోందని బాలాజీసింగ్ అన్నారు. సమావేశంలో ఆమనగల్లు మార్కెట్ వైస్‌చైర్మన్ భాస్కర్‌రెడ్డి, రేవంత్ మిత్రమండలి మండల అధ్యక్షుడు గంట నరేశ్, గ్రామాధ్యక్షుడు మధు, మాజీ ఎంపీటీసీ యాదయ్య, నాయకులు రామచంద్రయ్య, నర్సింహ, శ్రీశైలం, సురేందర్, మల్లేశ్, నర్సిరెడ్డి, వీరయ్య, వెంకటేశ్, రమేశ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

WANTED

★ ఫుడ్ మ్యానుఫ్యాక్చరింగ్ కంపెనీలో పనిచేయడానికి సూపర్‌వైజర్స్ కావలెను. Contact : 9701092430 AJH-003275

★ ఫుడ్ మ్యానుఫ్యాక్చరింగ్ కంపెనీలో పనిచేయడానికి B.Sc., గ్రాడ్యుయేట్స్ కావలెను. Contact : 9701092430 AJH-003276

ముగిసిన ఉచిత కంటి వైద్య శిబిరం

ఆమనగల్లు, జూలై 13(ఆంధ్రజ్యోతి): ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో సీకేఆర్ ఫంక్షన్‌లో 9రోజులపాటు నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరం ఆదివారం ముగిసింది. కార్యక్రమానికి ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సీవోవో సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి హాజరయ్యారు. చెన్నై శంకరన్ నేత్రాలయ సహకారంతో నిర్వహించిన శిబిరంలో 6వేల మందికి కంటి పరీక్షలు చేశారు. 3వేల కళ్లద్దాలు అందజేశారు. దృష్టిలోపం ఉన్న 153 మందికి ఐఓఎల్ ఆపరేషన్లు చేయించారు. సుంకిరెడ్డి కళ్లద్దాలను పంపిణీ చేశారు. నేత్ర వైద్య శిబిరంలో సేవలందించిన వైద్యులు, సిబ్బంది, ఫౌండేషన్ సభ్యులను సత్కరించారు. కల్వకుర్తి నియోజకవర్గంలో కంటి సమస్యలతో ఎవరూ ఇబ్బంది పడకూడదనే తాను శిబిరాన్ని ఏర్పాటు చేశానని చెప్పారు. నియోజకవర్గ వ్యాప్తంగా ముమ్ముందు కూడా శిబిరాలు నిర్వహిస్తామని చెప్పారు.ఫౌండేషన్ సేవలను మారుమూల గ్రామాలకు విస్తరిస్తామని తెలిపారు. విద్య, వైద్యం, ఉపాధి కల్పన, ఆరోగ్య సంరక్షణ ఐక్యత ఫౌండేషన్ ధ్యేయమని రాఘవేందర్‌రెడ్డి చెప్పారు. కార్యక్రమంలో ఫౌండేషన్ స భ్యులు శ్రీరాములు, నరేందర్‌గౌడ్, యూసుఫ్, గణేశ్,యాదయ్య, కొండల్, శేఖర్, రమేశ్‌నాయక్, శ్రీపతి, రాఘవేందర్, శివ, శ్రీను, కల్యాణ్, మల్లేశ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.


కంటి ఆపరేషన్ చేయించుకున్న వారితో సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి, ఫౌండేషన్ సభ్యులు

ఇంటర్ కోర్సుల్లో అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

తాండూరు రూరల్, జూలై 13, (ఆంధ్రజ్యోతి): జినుగుర్తిలోని బాలికల విద్యాలయంలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఆదివారం పేర్కొన్నారు. ఫస్టియర్ ఎంపీసీలో సీట్లు ఖాళీగా ఉన్నాయని, ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

కనుల పండువగా ఆషాఢ బోనాలు

- ఆకట్టుకున్న పోతరాజుల విన్యాసాలు
- అమ్మవార్లకు నైవేద్యం సమర్పణ


యాచారం : చౌదర్‌పల్లిలో బోనాల ఊరేగింపు


చేవెళ్ల : చంద్రారెడ్డినగర్ కాలనీలో పోతరాజుల విన్యాసాలు

షాద్‌నగర్ అర్బన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ పట్టణంలోని భగత్‌సింగ్ కాలనీలో వెలసిన వరాల పోచమ్మ తల్లి బోనాలు ఆదివారం వైభవంగా జరుపుకున్నారు. ఈశ్వర్‌కాలనీ, అనుబంధ కాలనీ వాసులు ప్రతిష్ఠించుకున్న వరాల పోచమ్మకు ఈశ్వర్‌కాలనీ, భగత్‌సింగ్‌కాలనీ, న్యూభాగ్యనగర్ కాలనీ, ప్రశాంత్ కాలనీ, జీహెచ్‌ఆర్‌తో పాటు తదితర కాలనీల వాసులు బ్యాండ్‌మేళాల మధ్య ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. పోతరాజులు విన్యాసాలు, చిన్నారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. బోనాల ఉత్సవాన్ని పురస్కరించుకొని ఉదయమే అమ్మవారికి అభిషేకం చేసి, ప్రత్యేకంగా అలకరించి, పూజలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నెల్లి శ్రీవర్ధన్‌రెడ్డి, అందె బాబయ్య, మాజీ కౌన్సిలర్ ఈశ్వర్ రాజు, కాలనీవాసులు ఎం.వెంకటరెడ్డి, మేడిగ పెంటయ్య, గోర మల్లేష్‌గౌడ్, పడకంటి శ్రీశైలం, కొప్పునూరి ప్రవీణ్, భాస్కర్, మంచిరేవుల అశోక్, రాఘవ చారి, శివ, గిరి, కుమ్మరి శ్రీశైలం తదితరులున్నారు.

ఇబ్రహీంపట్నం : ఇబ్రహీంపట్నంలో ఆదివారం శ్రీ మహంకాళి బోనాల ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఉదయం నుంచే భక్తులు ఎక్కువ సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించుకున్నారు. అమ్మవారికి ఒడిబియ్యం పోశారు. తొట్టెల ఊరేగింపు, శివసత్తులు, పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి.


శంషాబాద్ : మధురానగర్ పోచమ్మతల్లి ఆలయంలో నైవేద్యం సమర్పిస్తున్న భక్తులు


ఇబ్రహీంపట్నం : బోనాలతో అమ్మవారి ఆలయానికి తరలిన మహిళలు, యువతులు

యాచారం : మండలంలోని చౌదర్‌పల్లి, కొత్తపల్లి గ్రామాల్లో బోనాల ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. చౌదర్‌పల్లిలో మహాకాళి బోనాలు, కొత్తపల్లిలో రేణుకా ఎల్లమ్మ బోనాలు జరుపుకున్నారు. మహిళలు పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించి సాయంత్రం అమ్మవారికి బోనం సమర్పించారు. శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

శంషాబాద్ : శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలోని మధురానగర్, ఆర్బీనగర్, ఆదర్శనగర్, రాళ్లగూడ, సాతంరాయి బస్తీల్లో పోచమ్మతల్లి బోనాలు జరుపుకున్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆర్జీఐఏ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

చేవెళ్ల : చేవెళ్ల మండలంలో పలు గ్రామాల్లో బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. పట్టణ కేంద్రంలోని చంద్రారెడ్డినగర్ కాలనీ, వీరభద్ర కాలనీ, టీచర్స్ కాలనీ, రంగారెడ్డి కాలనీ, గణేష్‌నగర్, రాంరెడ్డినగర్ ఆయా కాలనీల్లో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈర్లపల్లి గ్రామంలో పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పీఏసీఎస్ చైర్మన్ వెంకటరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, చేవెళ్ల మాజీ జెడ్పీటీసీ మాలతీ కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్‌లు నర్సింలు, రాజశేఖర్, శైలజా ఆగిరెడ్డి, వనం లత, మాజీ ఎంపీటీసీ రాములు, నాయకులు వసంతం, ఎం.కృష్ణారెడ్డి, ఆగిరెడ్డి, యాదగిరి, వనం మహేందర్ రెడ్డి, రవీందర్, అడెల్లా శ్రీనివాస్, వెంకటేశ్, కటికె రమేశ్, సుబుద్ధిగౌడ్, సత్యనారాయణ, బాబు, విష్ణు, నాయకులు, గ్రామస్తులు భక్తులు తదితరులు ఉన్నారు.

ఆమనగల్లు : మున్సిపాలిటీ పరిధిలోని నుచ్చుగుట్ట తండాలో బంగారు మైసమ్మ బోనాలను ఘనంగా జరుపుకున్నారు. వివిధ ప్రాంతాల్లో ఉన్న గిరిజనులు తండాకు పెద్దసంఖ్యలో తరలిరావడంతో పండగ వాతావరణం నెలకొంది. మహిళలు పట్టు వస్త్రాలు ధరించి కుండలను అలంకరించుకొని ఊరేగింపుగా బంగారు మైసమ్మ ఆలయానికి చేరుకున్నారు. ప్రత్యేక నైవేద్యాలతో మొక్కులు తీర్చుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలు బాగా పండాలని, ప్రజలు ఆయు రారోగ్యాలతో ఉండాలని మొక్కుకున్నారు. ఆదివాసీ రాష్ట్ర నాయకుడు కృష్ణనాయక్, మాజీ ఎంపీపీ అనిత విజయ్, నాయకులు బాపూజీ కిరణ్‌స్వామి, సంతోష్, నరేందర్, శ్రీను, రఘుకుమార్, విజేందర్, శంకర్, రమేశ్, సందీప్, ప్రభాస్, భాస్కర్ తదితరులున్నారు.


ఆమనగల్లు : నుచ్చుగుట్ట తండాలో బోనాలతో మహిళల ఊరేగింపు

మహేశ్వరం : మండల పరిధిలోని మహేశ్వరం, అమీర్‌పేట, తుక్కుగూడ మున్సిపాలిటీలోని మంఖాల్, తుక్కుగూడలో మహాకాళి బోనాల ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుపుకున్నారు. స్టేట్ అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, పీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి, మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డితో పాటు పలువురు నాయకులు పాల్గొని అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.


మహేశ్వరం : బోనాల ఊరేగింపులో పాల్గొన్న భాస్కర్‌రెడ్డి తదితరులు

కందుకూరు : మహాకాళి బోనాలను కందుకూరు గ్రామంలో ఘనంగా జరుపుకున్నారు. మాజీ ఎంపీటీసీ రాజశేఖర్‌రెడ్డితో పాటు గ్రామస్తులు, వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


షాద్‌నగర్ అర్బన్ : ఈశ్వర్‌కాలనీలో నిర్వహించిన బోనాల ఊరేగింపులో నాయకులు, స్థానికులు

గోదాములు లేక గోస

(ఐదో పేజీ తరువాయి)

పంచాయతీ కోసం కేటాయించిన పది శాతం స్థలంలో గోదాం నిర్మాణం చేపట్టవచ్చు. కానీ అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడంపై రైతులు మండిపడుతున్నారు. గున్‌గల్, యాచారం, తక్కళ్లపల్లి, నందివనపర్తి, మాల్, తమ్మలోనిగూడ, గ్రామాలలో ఉన్న వెంచర్లలో పది శాతం స్థలాలు ఉన్నాయి. ఈ విషయం పంచాయతీ అధికారులకు తెలిసినా గోదాం నిర్మాణం చేపట్టలేకపోవడం దారుణమని రైతులు వాపోతున్నారు. యాచారంలోని ఓ ప్రైవేట్ భవన్ ఎదుట ధాన్యం కొనుగోలు కేంద్రం నడుపుతున్నారు. ప్రస్తుతం ఆ భవనాన్ని రాష్ట్ర రైతు వ్యవసాయ సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి ప్రభుత్వానికి అప్పగించారు. ఆ భవనం ఎదుట ఉన్న స్థలం పక్కన గోదాం నిర్మించడానికి అధికారులు ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. వర్షం వచ్చినప్పుడు ధాన్యం ఉంచడానికి గోదాం లేక అన్నదాతలు తీవ్రంగా నష్టపోతున్నారు. అలాగే తేమ శాతం 17 శాతం వరకు ఎండబెట్టి కొనుగోలు కేంద్రంలో ధాన్యం విక్రయించడానికి ఇబ్బంది పడుతున్నారు. నాయకులకు చిత్తశుద్ధి ఉంటే నిధులు మంజూరు చేసి గోదాంల నిర్మాణానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని మండల రైతులు, రైతుసంఘాల ప్రతినిధులు కోరుతున్నారు.



హర్యానా గవర్నర్‌ను కలిసిన తల్లోజు ఆచారి

ఆమనగల్లు, జూలై 13(ఆంధ్రజ్యోతి): హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయను ఎన్‌బీసీ మాజీ సభ్యుడు, బీజేపీ రాష్ట్ర నాయకుడు తల్లోజు ఆచారి మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా ఆచారికి దత్తాత్రేయ ప్రజలే నా ఆత్మకథ అనే పుస్తకాన్ని అందించినట్లు పేర్కొన్నారు.

ఇంకెప్పుడు ఇస్తరు?

(ఐదో పేజీ తరువాయి)

ఎవరైనా మృతిచెంది ఉంటే వారి వివరాలను తొలగించి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ప్రభుత్వం నుంచి వచ్చిన జాబితా ప్రకారం గ్రామ సభలో అర్హుల జాబితాను ప్రకటించారు. అభ్యంతరాలను కూడా స్వీకరించారు. కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను పరిశీలించి పరిగణనలోకి తీసుకున్నారు. భూమి లేని నిరుపేదలకు ఆత్మీయ భరోసా కింద జిల్లాలో 14,192 మంది లబ్ధిదారులు ఉన్నట్లు గుర్తించారు. గ్రామసభలో 3,993 మందిని వివిధ కారణాలతో డిలీట్ చేశారు. మిగిలిన 10,199 మందిని అర్హులుగా తేల్చారు. వీరికి మొదటి విడతలో రూ.6.23 కోట్లు లబ్ధిదారుల అకౌంట్లలో జమ చేశారు. రెండో విడత సాయం అందాల్సి ఉంది. లబ్ధిదారులు రెండో విడత సాయం కోసం ఎదురు చూస్తున్నారు.

ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని జనవరి 26న సీఎం రేవంత్‌రెడ్డి అట్టహాసంగా ప్రారంభించారు. రంగారెడ్డి జిల్లాలో ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, 27 మండలాలు ఉన్నాయి. అందులో 21 గ్రామీణ మండలాల్లో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని అమలు చేస్తున్నారు. మొత్తం 1,58,675 జాబ్ కార్డులుండగా.. 2,60,278 మంది కూలీలున్నారు. కాగా జిల్లాలో యాక్టివ్ జాబ్‌కార్డులు 98 వేలుండగా, 1.24 లక్షల మంది యాక్టివ్ వర్కర్లున్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకం కింద కనీసం 20 పనిదినాలైనా పూర్తి చేసి ఉండాలని నియమాన్ని విధించింది. కుటుంబంలో యజమానిగా ఎవరు ఉన్నప్పటికీ, ఆ కుటుంబంలోని మహిళను లబ్ధిదారుగా గుర్తించింది. జిల్లాలో ప్రస్తుతం 10,199 మంది అర్హులుగా ఉన్నారు. వీరికి మొదటి విడత సాయం అందినప్పటికీ, రెండో విడత కోసం ఎదురు చూస్తున్నారు. అయితే ఆత్మీయ భరోసా లబ్ధిదారుల ఎంపికపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలో 1.58 లక్షల జాబ్ కార్డులుంటే.. కేవలం 10 వేల మందిని అర్హులుగా గుర్తించడంపై ప్రశ్నిస్తున్నారు.

నిరుపేదల కష్టాలు తీరుతున్నాయి



ఇందిరమ్మ ఆత్మీయ భరోసా నిరుపేదల కష్టాలు తీరుస్తుంది. ఏటా రూ. 12వేల సాయం అందుతుండటంతో వారి కుటుంబ అవసరాలు తీర్చుకుంటున్నారు. కొందరు పిల్లల చదువుల కోసం ఖర్చు చేసుకుంటున్నారు. ఈ పథకం ద్వారా జిల్లాలో వేలాది మంది లబ్ధిపొందుతున్నారు.

- శ్రీలత, డీఆర్‌డీవో పీడీ

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేత

మాడ్గుల, జూలై 13(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన బామండ్లపల్లి లక్ష్మయ్య ఆదివారం మృతిచెందారు. అదే గ్రామానికి చెందిన సూదిని రాజేందర్‌రెడ్డి (ధర్మరాజు) మృతుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అంత్యక్రియల నిమిత్తం తన అనుచరుల ద్వారా రూ.15వేల ఆర్థిక సాయం అందజేశారు. కాంగ్రెస్ నాయకుడు సూదిని కొండల్‌రెడ్డి రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. మిద్దె రాములు, బామండ్ల పల్లి నర్సింహ్మ, శేఖర్‌లు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మాడ్గుల, జూలై 13(ఆంధ్రజ్యోతి): వందే మాతరం ఫౌండేషన్, శృతిలయ కల్చరల్ అకాడమీ, మై విలేజ్ మోడల్ విలేజ్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మాడ్గుల మండలంలోని తమ తమ సొంత గ్రామాలలో కలాం ట్యూషన్ కో-ఆర్డినేటర్, క్లస్టర్ కో-ఆర్డినేటర్‌గా పనిచేయుటకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జోనల్ ఇన్‌చార్జి తోలు జంగయ్య కోరారు. ఏదైనా డిగ్రీ అర్హత కలిగి ఆసక్తి గల యువతీయువకుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. వివరాలకు 99088 95873 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

యువత ఆర్థికంగా ఎదగాలి

తలకొండపల్లి, జూలై 13(ఆంధ్రజ్యోతి): యువత అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని నాయకులు సూచించారు. తలకొండపల్లి మండలం గట్టిప్పలపల్లి గ్రామానికి చెందిన రఫీ స్వయం ఉపాధి పథకాన్ని ఏర్పాటు చేసుకున్నాడు. ఆదివారం మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. డేవిడ్, శివకుమార్, చంద్రమౌళి, ఏదుల శంకర్, తదితరులు పాల్గొన్నారు.

పాషాకు బీజేపీ నాయకుల పరామర్శ


పాషాను పరామర్శిస్తున్న కండె హరిప్రసాద్, నాయకులు

ఆమనగల్లు, జూలై 13(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు లయన్స్‌క్లబ్ పీఆర్‌వో, విద్యానగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎంఏ పాషాను బీజేపీ రాష్ట్ర నాయకుడు, మాజీ జడ్పీటీసీ కండె హరిప్రసాద్ పరామర్శించారు. పాషా సతీమణి షాహిన్ ఇటీవల మృతిచెందింది. ఆమనగల్లు పట్టణంలోని ఆయన నివాసంలో ఆదివారం పాషాతో పాటు ఆయన కూతుళ్లు, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించారు. షాహిన్ మృతిపట్ల సంతాపం తెలిపారు. మనోధైర్యంతో ఉండాలని సూచించారు. అలాగే తలకొండపల్లి మాజీఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్ పాషాను పరామర్శించారు. నాయకులు గోరటి నర్సింహ, చెక్కాల లక్ష్మణ్, శ్రీకాంత్‌సింగ్, శ్రీను, సిరి, శేఖర్ తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణకు పెద్దపీట

కడ్తాల్, జూలై 13(ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్య పరిరక్షణకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని కాంగ్రెస్ పార్టీ కిసాన్‌సెల్ కడ్తాల మండలాధ్యక్షుడు బాల్‌రాజ్ అన్నారు. కాంగ్రెస్ ప్రజాపాలనలో ప్రతీ ఒక్కరికి మేలు జరుగుతుందని అన్నారు. కడ్తాల మండలం మక్తమాదారం గ్రామానికి చెందిన అంజయ్యకు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ.48 వేలు మంజూరయ్యాయి. ఆదివారం మక్తమాదారం గ్రామంలో స్థానిక నాయకులతో కలిసి బాధిత కుటుంబానికి చెక్కును బాల్‌రాజ్ అందజేశారు. రోగులకు మెరుగైన వైద్య సేవలందించేందుకు ప్రభుత్వ ఆసుపత్రులను తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు చెన్నయ్య, అంజయ్య, నారాయణగౌడ్, చంద్రయ్య, సత్తయ్య, యాదయ్య, ఆనంద్, రాములు, తదితరులున్నారు.


చెక్కు అందజేస్తున్న బాల్‌రాజ్

దశదిన కర్మకు హాజరైన చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య

- మల్గారి లక్ష్మమ్మకు నివాళి


దశదిన కర్మలో పాల్గొని నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య తదితరులు

చేవెళ్ల, జూలై 13(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని మల్గారెడ్డిగూడ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మల్గారి మోహన్‌రెడ్డి మాతృమూర్తి మల్గారి లక్ష్మమ్మతో పాటు వదిన మల్గారి లక్ష్మమ్మలు ఇటీవల మృతిచెందారు. ఈమేరకు కుటుంబ సభ్యులు ఆదివారం దశదిన కర్మ కార్యక్రమం చేవెళ్ల పట్టణ కేంద్రంలోని సీహెచ్‌ఆర్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య పాల్గొని ఇద్దరి చిత్రపటాల వద్ద పూలువేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ముడిమ్యాల్ పీఏసీఎస్ చైర్మన్ గోనె ప్రతాప్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు బండారు శైలజా ఆగిరెడ్డి, మల్గారి మోహన్‌రెడ్డి, శేరి శివారెడ్డితో పాటు కుటుంబ సభ్యులు మల్గారి మాధవరెడ్డి, వెంకట్‌రెడ్డి, రఘుపతిరెడ్డి, బంధువులు, వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు గ్రామస్తులు తదితరులు పెద్దఎత్తున హాజరయ్యారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థికసాయం

కేశంపేట, జూలై 13(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన బింగి పెంటమ్మ ఆదివారం మృతిచెందింది. ఈమేరకు విషయం తెలుసుకున్న కేశంపేట మాజీ జడ్పీటీసీ తాండ్ర విశాల శ్రవణ్‌రెడ్డి రూ.5వేలు, సీనియర్ జర్నలిస్టు రమణ గౌడ్ రూ.5వేలు, కాంగ్రెస్ నాయకుడు తలపాని పవన్‌కుమార్ రెడ్డి రూ.3వేలు మృతురాలి కుటుంబ సభ్యులకు అందించి, సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో గుండ్రాతి పాండు గౌడ్, ఎదమ హరికిషన్ రెడ్డి, పోలేపోగు మురళీమోహన్, శ్రీధర్, యాదయ్య, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

- పట్టాలు దాటుతుండగా ప్రమాదం



శంకర్‌పల్లి, జూలై 13(ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. వికారాబాద్ రైల్వే హెడ్‌కానిస్టేబుల్ హరిప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం ఉదయం కొండాకల్ రైల్వేగేటు సమీపంలో సుమారు 50-60 సంవత్సరాల మధ్య వయస్సు గల గుర్తుతెలియని వ్యక్తి పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొంది. దాంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి వివరాలు తెలియరాలేదు. మృతుడి కుడి చేతిమీద ఎనిమిది చుక్కల పచ్చబొట్టు, ఎడమ చేతిమీద ఈనాడు అని ఉంది. మృతుడి ఒంటిపై నలుపు రంగు ప్యాంటు, లేత నీలం రంగు హాఫ్‌షర్టు ఉందని, దానిపై ఫిరోజ్ టైలర్, క్వాద్రి చమన్-హైదరాబాద్ అని ఉందని తెలిపారు. మృతదేహాన్ని పంచనామా నిమిత్తం వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు హెడ్‌కానిస్టేబుల్ హరిప్రసాద్ వివరించారు.

మద్యం దుకాణానికి కన్నం

రూ.15వేలు, 12 బాటిళ్ల మద్యం అపహరణ..

మరో 15 బాటిళ్లను ధ్వంసం చేసిన దుండగులు

షాబాద్, జూలై 13(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీనరసింహ వైన్‌షాప్‌లో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి డబ్బు, బాటిళ్లు ఎత్తుకెళ్లిన ఘటన శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డి తెలిపిన వివరాల మేరకు.. లక్ష్మీనరసింహ వైన్‌షాపులో నిర్వాహకుడు మహేందర్ శనివారం రాత్రి 10 గంటలకు దుకాణానికి తాళంవేసి ఇంటికి వెళ్లాడు. ఆదివారం వైన్‌షాపు పక్కనే ఉండే రాజ్‌కుమార్ షాపు వెనకాల గోడకు పెద్ద రంధ్రం పడి ఉండటం గమనించి వైన్‌షాపు యజమానికి ఫోన్‌చేసి సమాచారం ఇచ్చాడు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో దర్యాప్తు చేపట్టారు. దుండగులు రూ.15వేల నగదు, 12 బాటిళ్ల విస్కీ దొంగిలించి, మరో 20 బాటిళ్లను ధ్వంసం చేసినట్లు గుర్తించారు. దొంగల ఆచూకీ కొరకు క్లూస్ టీంతో ఆధారాలను సేకరించారు. వైన్‌షాపు యజమాని మామిడి విజయ్‌పాల్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విలేకరులమంటూ బెదిరింపు

వ్యక్తి నుంచి రూ.20వేలు డిమాండ్..

పోలీసులకు బాధితుడి ఫిర్యాదు.. నలుగురిపై కేసు

చౌదరిగూడ, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఓ లారీడ్రైవర్ నుంచి రూ.20వేలు డిమాండ్ చేసిన విలేకరులపై కేసు నమోదు చేసినట్లు కొందుర్గు ఎస్సై రవీందర్ నాయక్ వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కొందుర్గు మండలం శ్రీరంగాపూర్ గ్రామానికి చెందిన ఓ రైతు తన వ్యవసాయ పొలం మీదుగా ఉన్న చెట్లు తొలగించాలని అతడి పక్కనే ఉన్న భూ యజమాని రామ్‌నాయక్‌కు చెప్పాడు. దాంతో ఆయన వద్ద పనిచేసే లారీడ్రైవర్ సబావత్ రమేష్‌కు విషయం చెప్పగా.. శనివారం చెట్లను తొలగించేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో నలుగురు వ్యక్తులు అక్కడికి చేరుకొని చెట్లను ఎందుకు తొలగిస్తున్నారని రమేష్‌ను ప్రశ్నించారు. దాంతో అతడు తన యజమాని చెప్పిన విధంగా చెట్లను తొలగిస్తున్నట్లు సమాధానమిచ్చాడు. అయితే, అనుమతి లేకుండా చెట్లను ఎలా తొలగిస్తారని, ఇది నేరమని.. తాము విలేకరులమంటూ రూ.20వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దాంతో రమేష్ తన యజమానికి ఫోన్ చేసేందుకు యత్నిస్తుండగా.. ఆ నలుగురు ఫోన్‌ను లాక్కొన్నారు. ఆదివారం తనను డబ్బులు డిమాండ్ చేశారంటూ రమేష్ కొందుర్గు పోలీసులకు ఫిర్యాదు చేయగా బైరమోని రమేష్‌తో పాటు మరో ముగ్గురిపై కేసు నమోదు చేశామని ఎస్సై రవీందర్ నాయక్ తెలిపారు.

రాష్ట్రంలో టీడీపీది క్రియాశీల పాత్ర


నూతన కమిటీని సన్మానిస్తున్న అంజిరెడ్డి తదితరులు

ఇబ్రహీంపట్నం, జూలై 13(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో తెలుగుదేశం పార్టీకి ప్రజల్లో మంచి ఆదరణ ఉందని, రానున్న రోజుల్లో పార్టీ క్రియాశీల పాత్ర పోషించనుందని ఇబ్రహీంపట్నం, భువనగిరి అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు గుమ్మడి అంజిరెడ్డి అన్నారు. ఆదివారం ఇబ్రహీంపట్నంలో జరిగిన టీడీపీ మండల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. టీడీపీ అంటేనే క్రమశిక్షణ, నిబద్ధతకు మారుపేరని ఆయన అన్నారు. టీడీపీ అధినేత, ఏపీ సీఎం చంద్రబాబు నాయకత్వంలో తెలంగాణలో టీడీపీకి పూర్వవైభవం తెచ్చేందుకు కార్యకర్తలు కృషి చేయాల్సి ఉందన్నారు. పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడానికి కార్యాచరణతో ముందుకు పోదామని ఆయన అన్నారు. తెలంగాణలో గత బీఆర్ఎస్, నేటి కాంగ్రెస్‌లో ఉన్న నాయకుల్లో చాలామంది గతంలో టీడీపీలో ఉన్నవారేనన్నారు. టీడీపీ సీనియర్ నాయకుడు జక్క రాంరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. టీడీపీ మండలాధ్యక్షుడిగా పొట్లచెరువు శివకృష్ణ, ఉపాధ్యక్షుడిగా పంది నర్సింహ, కార్యనిర్వాహక కార్యదర్శిగా దాసుగౌడ్, కార్యదర్శిగా ఏర్పుల నరేష్‌లను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో నాయకులు మెట్టు దామోదర్‌రెడ్డి, హరిశంకర్, అంజయ్య, రాజేష్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

హామీకి కట్టుబడిన కాంగ్రెస్

ఆదిభట్ల, జూలై 13(ఆంధ్రజ్యోతి): ఇచ్చిన మాట ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు ఈసీ శేఖర్‌గౌడ్ అన్నారు. ఈమేరకు ఆదిభట్ల మున్సిపల్ కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు ఈసీ శేఖర్‌గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కామారెడ్డి డిక్లరేషన్‌లో భాగంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారని, ఇచ్చిన మాట ప్రకారం రానున్న ఎన్నికలల్లో రిజర్వేషన్లు కల్పిస్తూ మంత్రివర్గం నిర్ణయం తీసుకోవడం చరిత్రాత్మక నిర్ణయం అని ఆయన అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రాజకీయ అవకాశాలు కల్పించడం కాంగ్రెస్ ప్రభుత్వానికే సాధ్యమన్నారు. కాంగ్రెస్ ప్రజాపాలనలో సబ్బండ వర్గాలకు సముచిత రాజకీయ స్థానం దక్కుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే బడుగు, బలహీన వర్గాల ప్రభుత్వమని, బీసీ రిజర్వేషన్ల నిర్ణయంతో అది రుజువైందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పల్లె రజనీకాంత్ గౌడ్, సురేష్, సాయిబాబాగౌడ్, దర్శన్, సతీష్, నరసింహ, సందీప్ తదితరులు పాల్గొన్నారు.


సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నేతలు